సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 31 । జూలై । 2025



చీనీ టన్ను రూ.16 వేలు
అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.16 వేలు. కనిష్టంగా రూ.3 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.40
కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.40. కనిష్టంగా రూ.27 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 3,750 టన్నుల టమాట వచ్చింది.

గరిష్ఠం/కనిష్ఠం
33.5°/21.4°
జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 15 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

వెన్నుపోటు బాబుకు కొత్తేమీ కాదు

- 'కియా' ఫ్యాక్టరీపై సవిత అనుచరుల దాడి హేయం
- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



విలేకరులతో మాట్లాడుతున్న ఉషశ్రీచరణ్

పరిగి: చంద్రబాబుకు వెన్నుపోటు కొత్తేమీకాదని, ఆయన రాజకీయ జీవితమంతా అదేనని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ అన్నారు. అధికారం కోసం పిల్లనిచ్చిన మామను వెన్నుపోటు పొడిచిన ఆయన...ఇప్పుడు హామీలిచ్చి వాటిని అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడుస్తున్నారన్నారు. మోసపూరిత వాగ్దానాలకు చంద్రబాబు పేరుగాంచారన్నారు. బుధవారం ఆమె పరిగిలో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు ఎన్నికల వేళ సూపర్ సిక్స్ అంటూ ప్రజలను మభ్యపెట్టారని, అధికారంలోకి వచ్చాక హామీలతో పాటు ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేంత వరకూ ప్రజల తరఫున వైఎస్సార్ సీపీ పోరాటం కొనసాగిస్తుందన్నారు.

ఉద్యోగులపై భారం మోపడం సిగ్గుచేటు
పీ–4 కార్యక్రమం ద్వారా నిరుపేదల జీవితాలను మారుస్తామంటూ గొప్పలు చెబుతున్న ప్రభుత్వం... నిరుపేద కుటుంబాల బాధ్యతను ఉద్యోగులు తీసుకోవాలని హుకూం జారీ చేయడమేంటని ఉషశ్రీచరణ్ ప్రశ్నించారు. జీతంపై ఆధారపడి బతికే ఉద్యోగులపై ఇలాంటి భారాన్ని మోపడం సిగ్గుగా ఉందన్నారు. నిజంగా సీఎం చంద్రబాబుకు నిరుపేదల సంక్షేమంపై చిత్తశుద్ధి ఉంటే తన హెరిటేజ్ ఫ్యాక్టరీని అమ్మి నిరుపేదలకు ఆర్థిక చేయూత ఇవ్వాలన్నారు.

దిగజారి ప్రవర్తిస్తున్న మంత్రి సవిత..
రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న మంత్రి సవిత సభ్యసమాజం సిగ్గుపడేలా వ్యవహరిస్తున్నారని ఉషశ్రీచరణ్ మండిపడ్డారు. 'కియా' పరిశ్రమలో ప్రతి కాంట్రాక్టు తన అనుచరులకు కట్టబెట్టేందుకు రౌడీయిజం చేసి, నియోజకవర్గ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. పరిగి మండలంలో ప్రీకాట్ మిల్లును మూయించి వేలాది కార్మిక కుటుంబాలను నడిరోడ్డున పడేశారని మండిపడ్డారు. అధికారం శాశ్వతం కాదని మంత్రి సవిత గుర్తించాలన్నారు. వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని అప్పుడు అందరికీ బుద్ధిచెప్పి తీరుతామన్నారు. ఉషశ్రీచరణ్ వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి తదితరులు ఉన్నారు.

అలరించిన సంగీత కచేరీ



కచేరీ నిర్వహిస్తున్న బాలవికాస్ చిన్నారులు

ప్రశాంతి నిలయం: పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ జోన్ –6 దేశాలకు చెందిన బాలవికాస్ చిన్నారులు చేసిన సంగీత కచేరీ భక్తులను అలరించింది. బుధవారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో చిన్నారులు సత్యసాయిని కీర్తిస్తూ చక్కటి భక్తి గీతాలు ఆలపించారు.

అసత్యాలు ప్రచారం చేస్తే కఠిన చర్యలు: ఎస్పీ రత్న



పుట్టపర్తి టౌన్: మీడియా, సోషల్ మీడియా వేదికగా ఎవరైనా అసత్యాలు ప్రచారాలు చేస్తే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ రత్న హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగాం తదితర సోషల్ మీడియా వేదికగా సత్యదూరమైన పోస్టులు పెట్టడం వల్ల అలజడులు చెలరేగే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల అసత్యప్రచారాలు చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. కదిరి మండలంలో గంజాయి మత్తులో యువకులు ఘర్షణ పడినట్లు మీడియాలో వచ్చిన కథనాల్లో ఏమాత్రం వాస్తవం లేదన్నారు. అలాగే పెనుకొండ వద్ద ఉన్న 'కియా' పరిశ్రమ వద్ద పెద్ద గొడవ జరిగినట్లు ప్రచారం జరిగిందని, ఇందులోనూ వాస్తవం లేదన్నారు. చిన్నపాటి గొడవ జరగడంతో పోలీసులు కలగజేసుకొని సర్దిచెప్పారన్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టి అలజడి సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా సరే వ్యక్తిగత దూషణ, కించపరిచే వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని సూచించారు.

బాబు హామీలన్నీ గాలి మాటలే





రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్‌లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, పార్టీ నేతలు,సమావేశానికి హాజరైన నాయకులు

- మోసం చేయడం ఆయన నైజం
- రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లో తారస్థాయికి 'పరిటాల' దందాలు
- అక్రమ కేసులకు భయపడేది లేదు
- రౌడీ రాజ్యాంగాన్ని అంతమొందించే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి
- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



రాప్తాడులో హత్యకు గురైన రైతు దంపతుల కుమారుడు ప్రదీప్‌కుమార్‌రెడ్డికి ధైర్యం చెబుతున్న ప్రకాష్ రెడ్డి

రాప్తాడురూరల్: అధికారం కోసం చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ గాలిమాటలుగా మారాయని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మండిపడ్డారు.'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమంలో భాగంగా బుధవారం అనంతపురం నగర శివారు టీవీ టవర్ సమీపంలో ఎస్‌జీఆర్ ఫంక్షన్ హాలులో రాప్తాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. రాప్తాడు వైస్ ఎంపీపీ రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన సమావేశానికి మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, నాయకులు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రరెడ్డి, బుక్కచెర్ల నల్లపరెడ్డి తదితరులు హాజరయ్యారు. సమావేశానికి రాప్తాడు నియోజకవర్గ నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ అధికారం కోసం చెప్పిన హామీలు చెప్పకుండా కొత్త హామీలతో మోసం చేయడం చంద్రబాబు నైజం అన్నారు. తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్ల అమలులో అతుకులు బొతుకులే ఉన్నాయన్నారు. కొత్త ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, రైతు భరోసా, ఉచిత బస్సు ప్రయాణం, 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1,500 పథకాలు తుస్సుమన్నాయన్నారు. ఏడాదిలో రూ. 1.80 లక్షల కోట్లు అప్పులు తేవడమే బాబు సృష్టించిన సంపద అని ఎద్దేవా చేశారు. చంద్రబాబు కట్టుకథలన్నీ ప్రజలకు అర్థమయ్యాయన్నారు. ప్రజలు తిరగబడే రోజులు దగ్గర పడ్డాయన్నారు. పాడి మహిళా రైతుల కోసమే తన సొంత నిధులతో 'అమ్మా' డెయిరీని ఏర్పాటు చేశానన్నారు. డెయిరీ నిర్వహణకు ఇబ్బందులు కల్గించారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ చూపిస్తే అమూల్ డెయిరీకి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రకటించారు.

దేవర దున్నపోతుల్లా వదిలారు..
రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లో అక్రమ వసూళ్లకు పరిటాల కుటుంబ సభ్యులు, బంధువులను దేవర దున్నపోతుల్లా వదిలారని ప్రకాష్ రెడ్డి ధ్వజమెత్తారు. పరిటాల కుటుంబం కోసం కేసుల్లో ఇరుక్కున్న బీసీ,ఎస్సీ,ఎస్టీల గురించి ఏమాత్రమూ పట్టించుకోవడం లేదన్నారు. పరిటాల సునీత కుమారులు, సోదరులు వసూల్ రాజాల అవతారం ఎత్తారన్నారు. అనంతపురం రూరల్,ధర్మవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఎవరు రిజిస్ట్రేషన్ చేసుకున్నా పరిటాల కుటుంబానికి కప్పం కట్టాలంట.... ఇదేమైనా వాళ్ల నాయన గంటా అని మండిపడ్డారు. కక్కలపల్లి టమాట మండీలో 'పరిటాల శ్రీరామ్ ట్యాక్స్' విధిస్తున్నారని, ఒక్కో బండికి రూ. 2,500 వసూలు చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటిదాకా పరిటాల కుటుంబం రూ. 30 కోట్లు వసూలు చేసిందన్నారు. వీరి దురాగతాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. ఇలాంటి కేసులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో సాగుతున్న రౌడీ రాజ్యాంగాన్ని అంతమొందించే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని హెచ్చరించారు. అనంతరం 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' క్యూఆర్ కోడ్‌లు విడుదల చేశారు.

పరామర్శకు వెళ్తే కేసులు పెట్టారు..

'రామగిరి మండలంలో ఒక దళిత బాలికను టీడీపీ గూండాలు గ్యాంగ్‌రేప్ చేశారు. ఈ విషయంపై నిరసన తెలియజేసేందుకు వెళ్తుంటే అరెస్ట్‌లు చేశారు. అక్రమ కేసులు పెట్టారు. ఎస్సీ నాయకులపై కూడా కేసులు బనాయించారు. మహిళలను మానభంగం చేస్తే ప్రశ్నించకూడదా? ఇటీవల అరవిందరెడ్డి అనే టీడీపీ కార్యకర్త ధర్మవరంలో ప్రెస్‌మీట్ పెట్టి పరిటాల రవీంద్ర వందమంది రెడ్లను హత్య చేయించాడన్నందుకు పరిటాల శ్రీరామ్ గూండాలు అతడి కాళ్లు, చేతులు విరగ్గొట్టారు. ఇది రెడ్‌బుక్ రాజ్యాంగం కాదా? పరిటాల శ్రీరామ్ ధర్మవరంలో తనకు ఎదురులేదనుకుంటున్నాడు. ధర్మవరం చరిత్రలో చేనేతల జోలికి ఎవరూ వెళ్లలేదు, కానీ శ్రీరామ్ వారి నుంచి కూడా బలవంతంగా డబ్బు వసూలు చేస్తున్నాడు. ఆస్తులు కూడా లాక్కుంటున్నాడు' అని తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు.

'అమ్మా' అనే పిలుపులేకుండా చేశారు

అక్రమంగా తమ భూమిని కాజేసేందుకని తనకు 'అమ్మా' అనే పిలుపులేకుండా చేశారని రాప్తాడులో ఇటీవల టీడీపీ నాయకుల చేతుల్లో హత్యకు గురైన చిగిచెర్ల నారాయణరెడ్డి, చిగిచెర్ల ముత్యాలమ్మల కుమారుడు ప్రదీప్‌కుమార్‌రెడ్డి కన్నీటి పర్యంతమయ్యాడు. పరిటాల సునీత, ధర్మవరపు మురళీ అండతోనే హత్యకు పాల్పడ్డారని, తన కళ్లముందే కొడవళ్లు, కట్టెలతో తన తల్లిదండ్రులపై దాడి చేశారని వాపోయాడు. టీడీపీ నాయకులు కనికరం లేకుండా తనకు అమ్మా అనే పిలుపులేకుండా చేశారని, తమ బాధ ఎవరికి చెప్పుకోవాలని కన్నీళ్లు పెట్టుకున్నాడు. హత్య కేసులోని ముగ్గురు నిందితులు ఇప్పటికీ బయటే తిరుగుతున్నారని, నిందితుల ఇళ్లకు పరిటాల సునీత, మురళీ తదితరులు వెళ్లి పరామర్శించి వచ్చారని చెప్పాడు. ఇంకోవైపు తన తండ్రి టీడీపీ నాయకుడంటూ ప్రచారం చేసి రాజకీయం చేయాలని చూశారని, మరి వారు మమ్మల్ని ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించాడు. 'ప్రకాష్‌రెడ్డి మా కుటుంబానికి అండగా నిలిచారు. మా కుటుంబం చచ్చేదాకా వైఎస్సార్ సీపీతోనే ఉంటుంది' అని స్పష్టం చేశాడు.

మా నాన్నను చంపారు



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పక్కన ఉన్నామనే మా నాన్న లింగమయ్యను హత్య చేశారు. నాపైనా దాడి చేశారు. 15 మంది దాడి చేస్తే ఇద్దరిపై మాత్రమే కేసు కట్టారు. జైల్లో ఉన్న నిందితులు బయటకు రాగానే మమ్మల్ని చంపుతారని చెబుతున్నారు. భయపడే ప్రసక్తేలేదు. పార్టీ కోసం నిలబడతాం. మా ఊరిలో చాలా రాజకీయం చేస్తున్నారు. జగనన్న మా ఇంటికి వచ్చినప్పుడు చాలా భరోసా ఇచ్చారు. తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాకు అండగా ఉన్నారు.

– మజ్జిగ మనోహర్, పాపిరెడ్డిపల్లి

హామీలపై ప్రశ్నిస్తారనే కేసులు



హామీలపై ప్రశ్నిస్తారనే భయంతోనే వైఎస్సార్ సీపీ నాయకులను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు పెడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. చివరకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కూడా ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారు. కార్యకర్తలే ముందుండి పార్టీని నడిపిస్తారు.

– తోపుదుర్తి చందు, వైఎస్సార్‌సీపీ నేత

మోసానికి బ్రాండ్ అంబాసిడర్



మోసానికి బ్రాండ్ అంబాసిడర్ బాబు. ఎన్నికల ముందు అబద్ధపు హామీలతో ఇంటింటికీ బాండ్లు ఇచ్చిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్కటీ అమలు చేయలేదు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారు. ప్రజల కోసం పాటుపడే జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం.

–బోయ గిరిజమ్మ,జెడ్పీ చైర్‌పర్సన్

ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి



అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు చేసిన మోసాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి. తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రాప్తాడు నియోజకవర్గం ప్రశాంతంగా ఉండేది. 'కూటమి' ఏడాది కాలంలోనే ఎంతలా మారిందో ప్రజలంతా చూస్తున్నారు. జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలి.

– మంగమ్మ, ఎమ్మెల్సీ

ఉడత ఊపులకు భయపడం



రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఉడత ఊపులకు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి భయపడరు. ఎన్ని అక్రమ కేసులు బనాయించినా ఆయన ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే ముందుకెళ్తున్నారు. వారి దురాగతాలను ఇంటింటికీ వెళ్లి తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉంది. 'స్థానిక' ఎన్నికల్లో మన సత్తా చాటి చెబుదాం.

–వెన్నపూస రవీంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు

'తోపుదుర్తి' ఒక బ్రాండ్



ఊరిపేరునే ఇంటి పేరుగా మార్చుకున్న 'తోపుదుర్తి' అనేది ఒక బ్రాండ్. రాప్తాడు నియోజకవర్గంలో ముగ్గురు మొనగాళ్లలా తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోదరులు ఉన్నారన్నారు. వారి ఆధ్వర్యంలో కార్యకర్తలు సమరానికి సిద్ధమయ్యారు. మనల్ని స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్రమంతా సిద్ధమవుతారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు పార్టీ, స్థానిక నాయకులు తప్పక అండగా ఉంటారు.

– వేణు, వైఎస్సార్‌సీపీ నాయకుడు, హిందూపురం

ధనదాహం.. దౌర్జన్యం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో కంపెనీలు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ససేమిరా అంటున్నారు. కూటమి నేతల దెబ్బకు ఒక్క కొత్త కంపెనీ కూడా రాని దుస్థితి నెలకొంది. ఇటీవల గ్రీన్‌టెక్ రీమిక్స్ కంపెనీ ప్రతినిధులపై మంత్రి సవిత అనుచరులు బెదిరింపులకు దిగిన విషయం మరచిపోకముందే.. తాజాగా 'కియా' కార్ల పరిశ్రమల్లో కాంట్రాక్టుల కోసం మంత్రి అనుచరులు రభస చేయడం జిల్లాలోనే కాదు.. రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. చిన్న పరిశ్రమ స్థాపనకు రేకుల షెడ్డు వేసినా ఎమ్మెల్యేలు వసూళ్లకు తెగబడుతుండడంతో పెట్టుబడిదారులు రావడం లేదు. దీంతో ప్రభుత్వానికి ఆదాయం దారుణంగా పడిపోయింది.

- అక్రమార్జనకు 'తమ్ముళ్ల' అర్రులు
- చెప్పినట్లు వినకుంటే దౌర్జన్యాలు
- ఇప్పటికే తారస్థాయికి ప్రజాప్రతినిధుల దందాలు
- భయభ్రాంతులకు గురవుతున్న పారిశ్రామికవేత్తలు
- కూటమి సర్కారు వచ్చాక ఒక్క కొత్త పరిశ్రమా ఏర్పాటు కాని వైనం



మంగళవారం సంఘు హైటెక్ వద్ద ఆందోళన చేస్తున్న టీడీపీ నాయకులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పరిశ్రమల స్థాపనకు రాష్ట్రంలోనే ఉమ్మడి అనంతపురం జిల్లా అత్యంత అనువైన ప్రాంతంగా పేరుపొందింది. అలాంటి జిల్లాలో పరిశ్రమలు స్థాపించి ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన కూటమి సర్కారు ఆ విషయాన్ని అసలు పట్టించుకోవడమే లేదు. కూటమి సర్కారు వచ్చి 13 మాసాలు దాటినా శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాల్లో ఒక్కటంటే ఒక్క చిన్న పరిశ్రమ కూడా ఏర్పాటు కాకపోవడమే ఇందుకు నిదర్శనం.

గ్రీన్‌టెక్ రీమిక్స్ కంపెనీకి బెదిరింపులు..
కూటమి ప్రజాప్రతినిధుల ముడుపుల దాహానికి పారిశ్రామికవేత్తలు బెంబేలెత్తుతున్నారు. రూ.10 లక్షల పెట్టుబడి పెట్టేందుకు కూడా వెనుకడుగు వేస్తున్న దుస్థితి నెలకొంది. పెనుకొండ నియోజకవర్గంలో కొన్నేళ్లుగా గ్రీన్‌టెక్ రీమిక్స్ కంపెనీ నడుస్తోంది. కూటమి సర్కారు రాగానే ఆ కంపెనీని సొంతం చేసుకోవాలని ఆ ప్రాంత మంత్రి పట్టుబట్టారు. అందుకు ఒప్పుకోక పోవడంతో కంపెనీకి ముడిసరుకు సప్లై కాకుండా ఆపివేయించారు. దీంతో విధిలేక సదరు కంపెనీ ప్రతినిధులు టీడీపీకి చెందిన ఎంపీతో మాట్లాడుకుని ప్లాంటులో 50 శాతం భాగస్వామ్యం ఇచ్చారు. పరిశ్రమలను ప్రోత్సహించాల్సిన మంత్రే బెదిరింపులకు పాల్పడిన అంశం ఉమ్మడి జిల్లాలో అప్పట్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

ఉమ్మడి జిల్లాలో పరిస్థితి ఇదీ		
కేటగిరీ	క్లెయిమ్స్	మార్జిన్ మనీ (రూ.లలో)
ఇన్వెస్ట్‌మెంట్ సబ్సిడీ	06	55,21,384
పవర్ కాస్ట్ రీయింబర్స్‌మెంట్	09	5,30,036
ఇంట్రెస్ట్ సబ్సిడీ	06	2,34,621
మొత్తం	21	62,86,041
(అన్నీ కలిసి సబ్సిడీలు రూ.62 లక్షలే అంటే పరిస్థితి అంచనా వేయొచ్చు)		

కియాలో దౌర్జన్యకాండ..
డీజిల్, మట్టి దందాలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రికి.. తాజాగా 'కియా' పరిశ్రమపై కన్నుపడింది. 'కియా'లో పలు రకాల కాంట్రాక్టులు థర్డ్ పార్టీకి ఇస్తారు. ఎప్పట్నుంచో ఇది నడుస్తున్నదే. కియా చుట్టూ పలు అనుబంధ పరిశ్రమలూ వచ్చాయి. అయితే కియాలో కాంట్రాక్టులన్నీ తమకే కావాలని మంత్రి సవిత అనుచరులు రెండు రోజుల క్రితం దౌర్జన్యానికి దిగారు. మంత్రి అనుచరులు వందల మంది రావడంతో కియా కంపెనీ ప్రతినిధులు ఒక్కసారిగా తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కియా తన మానస పుత్రిక అని చెప్పుకునే చంద్రబాబు.. తన కేబినెట్‌లోని మంత్రే బెదిరిస్తుండటాన్ని నిలువరించలేకపోవడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.

భూమి పూజ రోజు నుంచే..
ఏదైనా పరిశ్రమ పెడదామని ఎవరైనా భూమి పూజ చేస్తే ఆ రోజునుంచే ఎంత ఇస్తారు, ఇవ్వకపోతే పరిశ్రమలు నడుపుకోలేరు అంటూ మంత్రులు, ఎమ్మెల్యేలు, వారి అనుచరులు దౌర్జన్యం చేస్తున్న పరిస్థితి. చివరకు బెంగళూరు–హైదరాబాద్ జాతీయ రహదారిలో ఉన్న ధాబాలు, హోటళ్లను సైతం నేతలు వదలడం లేదు. నెలనెలా మామూళ్లు ఇవ్వకపోతే ఇక మీ ఇష్టం అంటూ బెదిరిస్తున్నారు. సర్కస్ కంపెనీలు నడవాలన్నా ముడుపులు డిమాండ్ చేస్తున్న దుస్థితి నెలకొంది. ఈ క్రమంలో కొత్తగా పరిశ్రమలు పెట్టడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో కొత్త ఉద్యోగాలు రాకపోగా, ఉన్న ఉద్యోగాలూ పోతున్న దుస్థితి నెలకొంది.

రైతుల పేరుతో తమ్ముళ్ల డ్రామా

- 'కియా' వద్ద అలజడితో మంత్రి సవితపై వెల్లువెత్తిన విమర్శలు
- దిద్దుబాటు చర్యలకు దిగిన టీడీపీ నేతలు
- స్థానికులకు ఉద్యోగాలివ్వాలనే ఆందోళన చేసినట్లు వెల్లడి



రైతుల పేరుతో సమావేశం నిర్వహించిన టీడీపీ నాయకులు

పెనుకొండ: కాంట్రాక్టులు, కమీషన్ల కోసం 'కియా' అనుబంధ కంపెనీ ఎదుట తెలుగు తమ్ముళ్ల అలజడిపై విమర్శలు వెల్లువెత్తగా..టీడీపీ నేతలు దిద్దుబాటు చర్యలకు దిగారు. బుధవారం రైతుల పేరుతో సమావేశం నిర్వహించి సరికొత్త నాటకానికి తెరలేపారు. 'కియా'తో పాటు అనుబంధ కంపెనీలకు భూములిచ్చిన రైతుల కుటుంబాల్లోని వారికి ఉద్యోగాలివ్వాలంటూ హైడ్రామా నడిపారు.

వెలుగులోకి మంత్రి సవిత ఆగడాలు..
మంగళవారం సంఘు హైటెక్ కంపెనీ వద్ద తెలుగు తమ్ముళ్లు చేసిన హంగామాతో మంత్రి సవిత ఆగడాలు వెలుగులోకి వస్తున్నాయి. కాంట్రాక్టులు, కమీషన్ల కోసం మంత్రి సవితనే అనుచరులను ఉసిగొల్పారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో ఇప్పటికే పలు కంపెనీలపై, వాహనాల యజమానులపై తెలుగు తమ్ముళ్లు చేసిన దాడుల ఘటనలూ మరోసారి చర్చనీయాంశమయ్యాయి. గతంలో గ్రీన్ టెక్ కంపెనీకి వెళ్లే కంకర లారీలు నిలిపి వేయడం, దౌర్జన్యానికి పాల్పడటం, మామూళ్ల కోసం ఇటీవల కియా అనుబంధ కంపెనీకి సామగ్రి తెచ్చిన ఓ కంటెయినర్ లారీ అద్దాలు పగుల గొట్టిన అంశాలు తెరపైకి వచ్చాయి.

వెళ్లిపోయేందుకు సిద్ధమైన కంపెనీలు..
మంత్రి సవిత అనుచరుల ఆగడాలతో కియా అనుబంధ కంపెనీలను మరో ప్రాంతానికి తరలించాలన్న నిర్ణయానికి యజమానులు వచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఎంతో ఓర్పుతో ఉన్నామని... ఇక ఈ ప్రాంతం నుంచి వెళ్లిపోవడమే మేలనే ఆలోచనతో ఉన్నట్లు పలు కంపెనీల యజమానులు చెబుతున్నారు. దీంతో టీడీపీ అధిష్టానం కూడా ఇరుకునపడినట్లు తెలుస్తోంది. స్థానికంగా కూడా విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో మంత్రి అనుచరులు బుధవారం సమావేశం నిర్వహించి రైతులకు న్యాయం చేయాలని పేర్కొనడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. కియా సబ్ కంపెనీలకు, కియా కంపెనీకి భూములిచ్చిన ప్రతి రైతు కుటుంబానికి ఇప్పటికే 'కియా'లో ఉద్యోగాలు లభించాయనీ, ఇప్పుడు టీడీపీ నాయకులు ఎవరికి ఉద్యోగాలు ఇప్పిస్తారోనని జనం చర్చించుకుంటున్నారు.

కనుల పండువగా రథోత్సవం



ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకెళుతున్న దృశ్యం

విడపనకల్లు: మండలంలోని పాల్తూరు పంచాయతీ పరిధిలో ఉన్న ఉండబండ వీరభద్ర స్వామి రథోత్సవం బుధవారం సాయంత్రం కనుల పండువగా సాగింది. మండలంలోని ఉండబండ, పాల్తూరు, చీకలగురికి, విడపనకల్లు, కరకముక్కల, గాజుల మల్లాపురం, ఉరవకొండ, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. ఉదయం ఆలయంలో వీరభద్రస్వామి, కాళికాదేవి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

పౌర సరఫరాలు అస్తవ్యస్తం

- ఈ నెల 17న కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న 300 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మడకశిరలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే పెనుకొండలోనూ అక్రమంగా తరలిస్తున్న 250 క్వింటాళ్ల పేదల బియ్యం పట్టుబడింది. క్షేత్రస్థాయిలో విజిలెన్స్ కమిటీల పర్యవేక్షణ లేకపోవడంతో రేషన్ బియ్యం అక్రమ తరలింపులకు కారణంగా తెలుస్తోంది.
- ఓడీసీ మండల వ్యాప్తంగా డీలర్లు రేషన్ తూకాలలో మోసాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. బియ్యం తూకం వేసే క్రమంలో చక్కెర సంచులు వాడుతుండడంతో కార్డుదారులకు ఒక కిలో మేర బియ్యం తక్కువగా అందుతోంది. అయితే ఈ అక్రమాలను నిలువరించే విజిలెన్స్ కమిటీల ఏర్పాటులో కూటమి ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందనే విమర్శలున్నాయి.



- ఏడాది పూర్తయినా ఏర్పాటు కాని పౌరసరఫరాల విజిలెన్స్ కమిటీలు
- విజిలెన్స్ కమిటీల ఏర్పాటులో ప్రభుత్వ నిర్లక్ష్యం
- పర్యవేక్షణ లేక గాడితప్పిన పౌరసరఫరాల వ్యవస్థ
- పక్కదారి పడుతున్న నిత్యావసరాలు

ప్రశాంతి నిలయం: జిల్లాలో విజిలెన్స్ కమిటీలు ఏర్పాటు కాకపోవడంతో పౌరసరఫరాల పంపిణీలో అక్రమాలు తారస్థాయికి చేరుకున్నాయి. పేదలకు అందాల్సిన బియ్యాన్ని అక్రమంగా కర్ణాటకకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. 2024, అక్టోబర్ నుంచి ఈ ఏడాది జూన్ వరకూ ప్రభుత్వం పంపిణీ చేసిన చౌక బియ్యం అక్రమ రవాణా, నిల్వలకు సంబంధించి 23 కేసులు నమోదు కాగా, ఇందులో రూ.21.78 లక్షల విలువ చేసే 876 క్వింటాళ్ల బియ్యం పట్టుబడింది. ఇక అధికారుల కళ్లు కప్పి రోజూ పొరుగు రాష్ట్రాలకు టన్నుల కొద్దీ రేషన్ బియ్యం రాచమార్గంలోనే తరలిపోతోంది. ఈ అక్రమాలను ఎప్పటికప్పుడు అడ్డుకునే విజిలెన్స్ కమిటీలు ఏర్పాటు కాకపోవడంతో పౌరసరఫరాల వ్యవస్థ నిర్వీర్యమవుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి.

విజిలెన్స్ కమిటీల ఏర్పాటులో నిర్లక్ష్యం..

జిల్లా వ్యాప్తంగా 5,67,118 రేషన్ కార్డులుండగా.. వీరిలో చాలా మందికి రేషన్ సక్రమంగా అందడం లేదు. రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరితోపాటు అంగన్‌వాడీ పాఠశాల ద్వారా చిన్నారులకు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి బియ్యంతో పాటు ఇతర సరుకులను పౌరఫరాల శాఖ ద్వారా నియమించబడిన డీలర్ల ద్వారా అందుతుంది. వీటి పంపిణీ సక్రమంగా జరిగేలా పర్యవేక్షించేందుకు, క్షేత్రస్థాయిలో లోపాలను ఎప్పటికప్పుడు సరిదిద్దేందుకు గతంలో గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేశారు. జిల్లా స్థాయిలో కలెక్టర్, మండల స్థాయిలో తహసీల్దార్, డివిజన్ స్థాయిలో ఆర్‌డీఓ చైర్మన్‌గా కమిటీలు ఏర్పాటయ్యేవి. సభ్యులుగా రాజకీయ పార్టీల ప్రతినిదులు, ప్రజా ప్రతినిధులు, ఆహార సలహా సంఘాల సభ్యులు ఉండేవారు. ఈ కమిటీలు ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశమై నిత్యావసరాల పంపిణీ, ధరల నియంత్రణ, నిత్యావసరాల్లో నాణ్యతపై చర్చించి, ఆ దిశగా చర్యలు చేపట్టేవారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఈ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీల ఊసే లేకుండా పోయింది. కమిటీల ఏర్పాటులో ప్రభుత్వం అంతులేని నిర్లక్ష్యం వహించడంతో ప్రజా సంపిణీ వ్యవస్థ పూర్తిగా గాడితప్పింది.

ఇష్టారాజ్యంగా సరుకుల అక్రమ తరలింపు..

విజిలెన్స్ పర్యవేక్షణ లేకపోవడంతో రేషన్ సరఫరా వ్యవస్థ నామమాత్రంగా మారింది. ఇటీవల జిల్లాలో వెలుగు చూసిన ఘటనలే ఇందుకు నిదర్శనంగా నిలిచాయి. 2024, అక్టోబర్ నుంచి ఈ ఏడాది జూన్ వరకు జిల్లాలోని వివిధ మండలాలలో పౌరసరఫరాల శాఖ అధికారులు చేపట్టిన తనిఖీల్లో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేసిన 876 క్వింటాళ్ల నిత్యావసరాలు అక్రమంగా తరలిపోతుండగా పట్టుబడింది. వీటి విలువ సుమారు రూ.22 లక్షలగా అధికారులు లెక్కకట్టారు. ప్రశ్నించేవారు ఎవరూ లేకపోవడంతో డీలర్లు ఇష్టారాజ్యంగా సరుకులను ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్నారని ఆరోపణలున్నాయి. పాఠశాల విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రాల లబ్ధిదారులకు అందజేసే కోడిగుడ్లు, చిక్కీలు, బియ్యం, ఇతర సరుకుల్లో నాణ్యత లోపిస్తోందనే విమర్శలూ ఉన్నాయి.

ప్రజా పంపిణీ వ్యవస్థ నిర్వీర్యం



గతంలో విజిలెన్స్ కమిటీల పర్యవేక్షణ ఉండడంతో రేషన్ పంపిణీలో అక్రమాలకు తావు ఉండేది కాదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా విజిలెన్స్ కమిటీలు, ఆహార పర్యవేక్షణ కమిటీలు, ధరల నియంత్రణ కమిటీలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజాపంపిణీ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైంది. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు మేల్కొనకపోతే ప్రజా పంపిణీ వ్యవస్థ మనుగడ కష్టం.

– సురేష్ కుమార్, రాష్ట్ర వినియోగదారుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి, పుట్టపర్తి

ఉత్తర్వులు రాలేదు



విజిలెన్స్ కమిటీల ఏర్పాటుపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఉత్తర్వులు రాలేదు. ఉత్తర్వులు జారీ కాగానే కమిటీలు ఏర్పాటు చేస్తాం.

– వంశీకృష్ణారెడ్డి, డీఎస్‌ఓ

క్లుప్తంగా

భద్రతా నియమాలను పాటించాలి : డీఆర్‌ఎం



మాట్లాడుతున్న డీఆర్‌ఎం సీఎస్ గుప్తా

గుంతకల్లు: భద్రతా నియమాలను కచ్చితంగా పాటిస్తూ రైలు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని డీఆర్‌ఎం చంద్రశేఖర్‌గుప్తా ఆదేశించారు. బుధవారం స్థానిక డివిజనల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లతో ఆయన సమావేశమై మాట్లాడారు. ప్రస్తుత వర్షాకాలంలో అండర్ బ్రిడ్జిలలో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. లెవెల్ క్రాసింగ్ గేట్ల వద్ద పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. సురక్షితం కాని ట్రాక్‌లు, వంతెనలు, భారీ వర్షాలు కురిసే ప్రదేశాల్లో తప్పనిసరిగా పెట్రోలింగ్ చేపట్టాలన్నారు. ఇటీవల తిరుపతి రైల్వే స్టేషన్ ఔటర్‌లో జరిగిన అగ్నిప్రమాదం దృష్టిలో ఉంచుకుని పొగను గుర్తించే పరికరాలు, అగ్నిమాపక యంత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ డీఓఎం డాక్టర్ శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల ఆదేశాలతోనే విలేకరిపై కేసు

- వైఎస్సార్ సీపీ హిందూపురం సమన్వయకర్త టీఎన్ దీపిక



టీఎన్ దీపిక

చిలమత్తూరు: టీడీపీ నేతల ఆదేశాలతోనే తలుపుల సాక్షి విలేకరి రఘునాథరెడ్డిపై పోలీసులు అక్రమ కేసు బనాయించారని వైఎస్సార్ సీపీ హిందూపురం సమన్వయకర్త టీఎన్ దీపిక అన్నారు. బుధవారం ఆమె మండలంలోని సోమఘట్టలో విలేకరులతో మాట్లాడారు. అసర్ధ పాలన, అధికార పార్టీ నేతల దౌర్జన్యాలు, దందాలను వెలుగులోకి తీసుకువస్తున్నందునే టీడీపీ నేతలు సాక్షి విలేకరులపై కక్ష గట్టి పోలీసుల ద్వారా అక్రమ కేసులు బనాయిస్తూ భయాందోళనలకు గురిచేస్తున్నారన్నారు. విధి నిర్వహణలో భాగంగా పోలీసు స్టేషన్‌కు వెళ్లిన తలుపుల సాక్షి విలేకరి రఘునాథరెడ్డిపై హత్యకేసు బనాయించడం దుర్మార్గమన్నారు. అలాగే వారం రోజుల కిందట చిలమత్తూరుకు చెందిన టీడీపీ నాయకుడు సాక్షి విలేకరి శ్రీధర్‌రెడ్డికి ఫోన్ చేసి బెదిరిస్తే... విలేకరులందరూ వెళ్లి ఫిర్యాదు చేసినా పోలీసులు కనీసం కేసు కూడా నమోదు చేయలేదన్నారు. అధికార పార్టీ నేతలు చెప్పినట్లు ఆడుతున్న పోలీసులు న్యాయస్థానాల ముందు దోషులుగా నిలవాల్సి వస్తుందన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వంలో అరాచకాలు పెరిగిపోయాయని, ప్రశ్నించే గొంతులను నొక్కేందుకు కుట్ర చేస్తున్నారన్నారన్నారు. కూటమి ప్రభుత్వం శాశ్వతంగా ఉండదన్న విషయం గుర్తించుకోవాలన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అరాచకాలు చేస్తున్న కూటమి నేతలకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. వెంటనే తలుపుల విలేకరిపై నమోదు చేసిన అక్రమ కేసు పోలీసులు ఉపసంహరించాలని ఆమె డిమాండ్ చేశారు.

పేదలకు ఆర్థిక చేయూతనివ్వండి



పరిశ్రమల యజమానులతో చర్చిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

- పారిశ్రామిక వర్గాలను కోరిన కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీ–4 కార్యక్రమంలో భాగంగా సమాజంలోని నిరుపేదలకు ఆర్థిక చేయూతనిచ్చి అండగా నిలవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పారిశ్రామిక వర్గాలకు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ సమావేశ మందిరంలో జిల్లాలోని వివిధ పరిశ్రమల యజమానులు, ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పరిశ్రమల యజమానులు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న 20 శాతం నిరుపేదలు ఆర్థికంగా ఎదగడానికి చేయూతనివ్వాలన్నారు. ప్రతి పరిశ్రమ యజమాని వీలైనన్ని కుటుంబాలను దత్తత తీసుకోవాలని, వీలుంటే గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. ఇందుకు అందరూ ముందుకు రావాలన్నారు. సమావేశంలో సీపీఓ విజయ్ కుమార్, పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు, డిక్కీ జోనల్ ప్రతినిధి కోలా వెంకటరమణ, వివిధ పరిశ్రమల యజమానులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా సత్వర అనుమతులు..

సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు వెంటనే అనుమతులు లభిస్తాయని కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. బుధవారం కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పారిశ్రామిక రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు పరిశ్రమల శాఖతో పాటు అనుబంధ శాఖలన్నీ సమన్వయంతో పని చేయాలని సూచించారు. జిల్లాలో పారిశ్రామిక పెట్టుబడులు మరింత ప్రోత్సహించాలన్నారు. కొత్తగా పరిశ్రమలు స్థాపించాలనుకునే వారికి ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందించేలా బ్యాంకర్లతో మాట్లాడతామన్నారు. పట్టణ, గ్రామీణ యువతకు యూనిట్ల స్థాపనపై అవగాహన పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ నాగరాజు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి రాధాకృష్ణ, ఏపీఐఐసీ జెడ్‌ఎం, విద్యుత్ శాఖ, డిక్కీ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అక్రమ కేసుపై జర్నలిస్టుల ఆగ్రహం

- సాక్షి విలేకరి రఘునాథరెడ్డిపై కేసు ఎత్తివేయాలని డిమాండ్
- జిల్లా వ్యాప్తంగా పోలీసు స్టేషన్‌లలో వినతి పత్రాలు
- మద్దతుగా నిలిచిన జర్నలిస్టు సంఘాల నాయకులు



కదిరి డీఎస్పీకి వినతిపత్రం సమర్పిస్తున్న జర్నలిస్టులు

పుట్టపర్తి టౌన్/కదిరి అర్బన్: విధి నిర్వహణలో భాగంగా పోలీసు స్టేషన్‌కు వెళ్లిన తలుపుల సాక్షి విలేకరి రఘునాథరెడ్డిపై హత్యానేరం మోపడంపై జిల్లాలోని జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసు స్టేషన్‌కు వెళితే...ఎవరో ఆరోపించారని ఏకంగా హత్యానేరం మోపుతారా అంటూ ప్రశ్నించారు. విలేకరి రఘునాథరెడ్డిపై తలుపుల పోలీసులు బనాయించిన అక్రమ కేసును నిరసిస్తూ బుధవారం జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు పోలీసు స్టేషన్‌లకు వెళ్లి వినతి పత్రాలు సమర్పించారు. అక్రమ కేసును వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పుట్టపర్తిలో జర్నలిస్టులు నేరుగా జిల్లా పోలీసు కార్యాలయానికి వెళ్లగా... ఎస్పీ రత్న అందుబాటులో లేకపోవడంతో మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ ఆదినారాయణను కలిశారు. విలేకరి రఘునాథరెడ్డిపై పెట్టిన అక్రమ కేసును ఎత్తివేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తలుపుల మండలం రాజనోళ్లపల్లి మండలం సర్పంచ్ సుగుణమ్మ ఇంట్లో నవీన్ అనే వ్యక్తి చొరవడి కత్తితో ఆమెను బెదిరించి మెడలోని బంగారు గొలుసు లాక్కొని పారిపోగా.. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేశారని తెలిపారు. దీన్ని అవమానంగా భావించి నవీన్ ఆత్మహత్య చేసుకుంటే.. ఈ ఘటన వివరాలు తెలుసుకునేందుకు విధి నిర్వహణలో భాగంగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన సాక్షి విలేకరి రఘునాథరెడ్డిపై కేసు నమోదు చేయడం అక్రమమన్నారు. వెంటనే విలేకరి రఘునాథరెడ్డిపై పెట్టిన తప్పుడు కేసును ఎత్తి వేయాలని డీఎస్పీని కోరారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు పుల్లయ్య, ప్రధాన కార్యదర్శి డి.బాబు, విలేకరులు గంగిరెడ్డి, సాయికృష్ణారెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసు ఎత్తివేయాలి..

తలుపుల సాక్షి విలేకరి రఘునాథరెడ్డిపై అక్రమ కేసు బనాయించడాన్ని కదిరి జర్నలిస్టులు ముక్త కంఠంతో ఖండించారు. బుధవారం ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టులు డీఎస్పీ శివనారాయణ స్వామికి వినతిపత్రం అందజేశారు. విలేకరులపై అక్రమ కేసులు పెట్టడం సబబు కాదన్నారు. ఇలాంటి కేసులతో ప్రజాస్వామ్య వ్యవస్థకు పెను ప్రమాదమన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ చెరువు శ్రీనివాసరెడ్డి, ఉమ్మడి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ప్రసాద్, డివిజన్ కోశాధికారి జిలాన్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రామ్మోహన్, శివశంకర్ రెడ్డి, ఖలీల్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్- కాల్ డ్రైవర్లకు ఆహ్వానం

పుట్టపర్తి టౌన్: స్థానిక ఆర్టీసీ డిపోలో స్వల్పకాలిక డ్రైవింగ్ సేవల కోసం ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డిపో మేనేజర్ ఇనాయతుల్లా తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆన్-కాల్ డ్రైవర్లుగా పనిచేసేందుకు దరఖాస్తు చేసుకునేవారు 18 నుంచి 45 మధ్య వయస్సు, తప్పనిసరిగా హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. కార్యాలయ పనివేళల్లో బయోడేటాతో పాటు ఆర్టీఓ నుంచి క్లియరెన్స్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ ఒరిజినల్, జిరాక్స్ కాపీలతో హాజరు కావాలి. మెడికల్ చెకప్ అనంతరం అర్హత ఉన్నవారిని విధుల్లోకి తీసుకుంటారు. ఎంపికైన వారికి రోజువారీ చెల్లింపులు ఉంటాయి.

క్వారీలో కార్మికుడి దుర్మరణం



మృతుడు రఘురాములు

గుత్తి: కంకర క్వారీలో చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ కార్మికుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం నాగులదిబ్బ గ్రామానికి చెందిన సాకే రఘురాములు (32) గుత్తి సమీపంలోని పరమేశ్వర క్రషర్ యూనిట్‌లో కంప్రెషర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో క్రషర్ యూనిట్‌కు సంబంధించి జక్కల చెరువు వద్ద ఉన్న కొండపై భారీ బండరాళ్లను పేల్చేందుకు బుధవారం ఘాతాలు ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమయ్యాడు. ఘాతాలు అమర్చేందుకు ఓ బండరాయిపై కంప్రెషర్‌తో రంధ్రం చేస్తుండగా ఒక్కసారిగా డ్రిల్లింగ్ యంత్రం పైకి ఎగిసి రఘురాములను బలంగా తాకింది. దీంతో ఆయన గాలిలోకి ఎగిరి రాళ్లపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ సురేష్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

'ఈ- స్టాంపు' నిందితులకు బెయిల్

కళ్యాణదుర్గం రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన కళ్యాణదుర్గం నకిలీ ఈ-స్టాంపుల కేసులో ముగ్గురు నిందితులకు బుధవారం బెయిల్ మంజూరైంది. ఏ1 కట్టా భార్గవి, ఏ2 ఎర్రప్ప అలియాస్ మీసేవ బాబు, ఏ3 మోహన్‌బాబులకు బెయిల్ ఇస్తూ కళ్యాణదుర్గం జూనియర్ సివిల్ కోర్టు జడ్జి భాను ఉత్తర్వులిచ్చారు. దాదాపు నెల రోజుల తర్వాత వీరికి బెయిల్ రావడం గమనార్హం.

వివాహిత ఆత్మహత్య



మృతురాలు దివ్యకుమారి

గుంతకల్లు టౌన్: స్థానిక భాగ్యనగర్‌కు చెందిన వివాహిత దివ్యకుమారి(35) ఆత్మహత్య చేసుకుంది. 2013లో గుంతకల్లుకు చెందిన చంద్రశేఖర్‌ను ఆమె వివాహం చేసుకుంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. బియ్యం దుకాణంలో గుమాస్తాగా చంద్రశేఖర్ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. మంగళవారం ఉదయం పనికి వెళ్లిన ఆయన మధ్యాహ్నం భోజనానికి ఇంటికి చేరుకున్నాడు. ఎంత సేపు పిలిచినా భార్య తలుపు తీయకపోవడంతో బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించి చూశాడు. అప్పటికే బెడ్ రూమ్‌లో ఫ్యాన్‌కు వేసుకున్న ఉరికి విగతజీవిగా వేలాడుతున్న భార్యను చూసి వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. కడుపునొప్పితో బాధపడుతున్న తన కుమార్తె జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్లుగా మృతురాలి తల్లి లలితమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు గుంతకల్లు వన్‌టౌన్ సీఐ మనోహర్ తెలిపారు.

కుక్కల దాడిలో మేకల మృతి



మృతి చెందిన మేకలు


గుమ్మఘట్ట: కుక్కల దాడిలో 12 మేకలు మృతిచెందాయి. గుమ్మఘట్ట మండలం కోనాపురం గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. మేకల పోషణతో కుటుంబాన్ని పోషించుకుంటున్న గ్రామానికి చెందిన ఓబులేసు తన వద్ద ఉన్న 25 మేకలను మంగళవారం రాత్రి గ్రామంలోని పాకలో వదిలి ఇంటికెళ్లి నిద్రించాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత మందపై కుక్కలు దాడి చేశాయి. గమనించిన స్థానికులు గట్టిగా కేకలు వేస్తూ కుక్కలను అదిలించారు. అప్పటికే 12 మేకలు మృతి చెందాయి. ఘటనతో రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు బాధిత కాపరి వాపోయాడు.

దాడి కేసులో నలుగురికి జరిమానా

రొద్దం: మండలంలోని ఎల్.తిమ్మాపురంలో 2022లో చోటు చేసుకున్న దాడి కేసులో నలుగురికి జరిమానా విధిస్తూ పెనుకొండ ప్రిన్సిపల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ బొజ్జప్ప బుధవారం తీర్పు వెలురించారు. ఎస్‌ఐ నరేంద్ర తెలిపిన మేరకు.. 2022లో ఎల్.తిమ్మాపురంలో బయలు స్థలం విషయంలో చోటు చేసుకున్న గొడవలో గ్రామానికి చెందిన కురుబ ఆదిలక్ష్మమ్మపై అదే గ్రామానికి చెందిన కురుబ జయరామప్ప, వెంకటమ్మ, శంకరప్ప, ఉమక్క తదితరులు దాడి చేశారు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ నాగస్వామి కేసు నమోదు చేసి, నిందితులను కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం నేరం రుజువు కావడంతో ఒకొక్కరికి రూ. 2వేల చొప్పున జరిమానా, జరిమానా చెల్లించకపోతే ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి బొజ్జప్ప తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరఫున వాదనలను ఏపీపీ శ్యామల వాదించారు.

ద్విచక్ర వాహనాల ఢీ - మహిళ మృతి

పెద్దపప్పూరు: ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఓ మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు.. పెద్దపప్పూరు మండలం శింగనగుట్టపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీ దేవి(60) బుధవారం ఉదయం తన కుమారుడు రామాంజనేయులుతో కలసి పొలానికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ఘటనలో రోడ్డుపై పడిన లక్ష్మీదేవి అక్కడికక్కడే మృతి చెందింది. రామాంజనేయులుతో పాటు ప్రమాదానికి కారణమైన మరో ద్విచక్ర వాహనదారుడు ఎర్రిస్వామికి గాయాలయ్యాయి. కాగా, నార్పల మండలం కేసేపల్లికి చెందిన ఎర్రిస్వామి సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ ద్విచక్ర వాహనాన్ని వేగంగా నడుపుతూ ప్రమాదానికి కారణమైనట్లు ప్రత్యక్షసాక్షులు తెలిపారు. ఘటనపై ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.



- మేత కరువాయే

జిల్లాలో నెలకొన్న తీవ్ర వర్షాభావం పచ్చదనాన్ని దెబ్బతీసింది. కరువు ఛాయలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. చినుకు జాడ లేక.. పశువులు, జీవాలకు మేత కూడా దొరకని పరిస్థితి. ముదిగుబ్బ మండలం ముప్పాలపాడు గ్రామ పొలాల్లో బుధవారం వట్టి పొలాల్లోనే మేత కోసం గొర్రెలు అన్వేషిస్తున్న దృశ్యం అటుగా వెళుతున్న వారి హృదయాలను కలిచి వేసింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం


'నవోదయ'లో ముగిసిన వైజ్ఞానిక ప్రదర్శన



సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న నవోదయ విద్యాలయ హైదరాబాద్ రీజియన్ సమితి ఏసీ సూర్యప్రకాష్‌రావు

లేపాక్షి: స్థానిక పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయలో ఏర్పాటు చేసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శన బుధవారంతో ముగిసింది. బీజాపూర్ క్లస్టర్ పరిధిలోని 18 నవోదయ విద్యాలయాల విద్యార్థులు రూపొందించిన పలు ప్రాజెక్ట్‌లను రెండు రోజులుగా ప్రదర్శించి, ఆకట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి చిత్తూరు, నెల్లూరు, కడప, కర్నూలు జిల్లాల నవోదయ విద్యాలయాలతో పాటు కర్ణాటకలోని బెంగళూరు అర్బన్, బెంగళూరు రూరల్, బళ్లారి, బీదర్, గదగ్, కొప్పల్, కలబుర్గి-1, కలబుర్గి-2, విజయనగర, దావనగెరి, యాదగిరి, రాయచూర్, విజయనగర-2 నవోదయ విద్యార్థులు పాల్గొన్నారు. ఒక్కో నవోదయ విద్యాలయ నుంచి ఏడుగురు చొప్పున విద్యార్థుల ప్రాజెక్ట్‌లను ప్రదర్శించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హైదరాబాద్ రీజియన్ నవోదయ విద్యాలయ సమితి అసిస్టెంట్ కమిషనర్ సూర్యప్రకాష్‌రావు హాజరయ్యారు. బెంగళూరు అర్బన్ నవోదయ విద్యాలయ విద్యార్థులు ప్రదర్శించిన ట్రాన్స్‌పోర్టు అండ్ కమ్యూనికేషన్ ప్రాజెక్ట్ ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను దక్కించుకున్నట్లు లేపాక్షి నవోదయ ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు.

బ్యాంకు దోపిడీ ఘటనపై సంయుక్త దర్యాప్తు



తూముకుంట ఎస్‌బీఐ వద్ద డీఎస్పీ మహేష్‌తో చర్చిస్తున్న కర్ణాటక, తెలంగాణ పోలీసు అధికారులు

హిందూపురం: స్థానిక తూముకుంట పారిశ్రామిక వాడలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌లో చోటు చేసుకున్న దోపిడీపై ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టారు. 2009లో ప్రారంభించిన ఈ బ్రాంచ్‌లో 5వేల మంది ఖాతాదారులు ఉన్నారు. రిజర్వ్ బ్యాంక్ నిబంధనలు మేరకు బ్యాంకులో రోజుకు రూ.50 లక్షల వరకు డిపాజిట్‌కు అనుమతులున్నాయి. ఆదివారం సెలవు కావడంతో బ్యాంకు లాకర్‌లో ఉన్న సుమారు రూ.38లక్షల వరకు నగదును దుండగులు అపహరించారు. అలాగే 595 మంది గోల్డ్‌లోన్ ఖాతాదారులుండగా ఇందులో 393 మందికి సంబంధించిన 11వేల 400 గ్రాముల వివిధ క్యారెట్ల బంగారు నగలు అపహరించినట్లుగా అంచనా వేశారు. భారీ దోపిడీపై ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక పోలీసులు సంయుక్త ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం బ్యాంక్ వద్ద డీఎస్పీ మహేష్‌తో పాటు కర్ణాటకలోని చిక్కబళ్లాపురం ఏఎస్పీ జగన్నాథరాయ్, తెలంగాణ పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. పరస్పరం తమ ప్రాంతాల్లో చోటు చేసుకున్న ఇలాంటి తరహా చోరీలపై చర్చించారు. కాగా, మంగళవారం సాయంత్రం డీఐజీ షిమోషి, ఎస్పీ రత్న కూడా బ్యాంకు వద్దకు చేరుకుని పరిశీలించారు. బ్యాంకు దోపిడీకి పాల్పడిన వారు ఢిల్లీ పరిసరాల్లో ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమయ్యాయి.

కల్యాణం.. వైభోగం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

ఆత్మకూరు: శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా బుధవారం పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అర్చకులు ఘనంగా కల్యాణం జరిపించారు. శ్రీవల్లి దేవసేన, సుబ్రహ్మణ్యేశ్వర ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. వేద పండితుల మంత్రాలు, మంగళవాయిద్యాలతో పసుపు, కుంకుమ కలిపిన అక్షింతలతో కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు.